# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

వ మాసపత్రిక

JUNE 1996

# మీకొక సదవకాశము

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న " సత్యవాణి" అను రేడియో కార్యక్రమము ద్వారా మరియు మేము ప్రచురించు పుస్తకముల ద్వారా లక్షలాది ప్రజలు ఆత్మీయ మేలులను పొందుచున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు అనేకములు మావద్ద కలవు. మీరు కేవలము రూ. **25/** –లు ఈక్రింది అడ్రసు M.O. చేసినచో రూ.100/ –లకు మించిన విలువగల 15 నుండి 20 రకముల పుస్తకములు మరియు 2 సంవత్సరములవరకు "సత్యవాక్కు" అను మాసపత్రికను మీరు పొందగలరు.

వెంటనే మీ పేరు నమోదు చేయించుకొనండి. మీ యింటిలో ఒక మినీ క్రైస్తవ గ్రంథాలయము తెరవండి. మావద్దలభించు పుస్తకముల రేట్ల వివరములు పోస్టేజీతో సహా

| | |
|---|---|
| 1 కీర్తన పుస్తకం | రూ.14–00 |
| 2 పెద్ద అచ్చు బైబిలు | 110–00 |
| 3. రిఫరెన్సు బైబిలు | 75–00 |
| 4. 15 నుండి 20 మంచి పుస్తకములు మరియు 2 సంవత్సరముల పాటు సత్యవాక్కు మాసపత్రిక ఉచితం | 25–00 |

గమనిక : మీరు పంపు పైకము **M.O.** ద్వారా పంపవలెను. దేనికొరకు మీరు సొమ్ము పంపుతున్నారో కూడ వ్రాయండి.

**SATYA VANI**
Sambamurthi Street, Ramaraopet,
KAKINADA - 533 004.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**
P.o. Box 80, Kakinada, A.P. 533 001
Phone : 0884-63722

Editor :
**J.C. CHOATE**

Managing Editor :
**JOSHUA GOOTAM**

Pleading for Restoration of First Century Christianity

సంపుటి 16 జూన్ 1996 సంచిక 11

## సంపాదకీయం

### జ్ఞానము గలవాడు ఇతరులను రక్షించును

**(He that winneth Souls is wise)**

మీరు పరలోకానికి వెళ్లగోరుచున్నారా? అవునని ప్రతివారు జవాబిస్తారు. అయితే మీరు ఎంతమందిని రక్షించగలిగారు ? ఎంతమందిని క్రీస్తులోనికి నడిపించారు ? ఎవరినీ లేదని మీరు జవాబిస్తే, మీరు పరలోకానికి వెళ్లలేరు. పరలోకంలో ఒంటరిగా ఎవరు ప్రవేశించలేరు. "నాలో ఫలింపని ప్రతితీగెను ఆయన తీసిపారవేయును " అని యేసు ప్రభువు చెప్పారు (యోహాను 15 :2).

మొదటి శతాబ్దపు క్రీస్తు సంఘానికి, ఇరవయ్యో శతాబ్దపు క్రీస్తుసంఘానికి సువార్త ప్రకటనను గూర్చిన ఆసక్తిలో చాల తేడా యున్నది. వారు ఎక్కడికి

వెళ్లినను సువార్త వాక్యమును ప్రకటించుచు సంచారము చేసారు (అపొ.కా. 8 : 4). అందువలన వారి కాలములోనే ఆకాశము క్రింద ఉన్న సమస్త సృష్టికి సువార్త ప్రకటింపబడింది (కొలస్స 1 : 23). నాడు వారికి కార్లు, బస్సులు, రైళ్లు, విమానములు లేవు, అయినను సర్వసృష్టికి వారు సువార్త ప్రకటించగలిగారు. ఈ సదుపాయాలన్నీ మనకున్నాయి. అందువలన సునాయాసంగా ఎక్కడికైన ప్రయాణించగలుగుచున్నాము. గాని ఎక్కడికి వెళ్లినా అక్కడ సువార్త ప్రకటించలేకపోవు చున్నాము.

"నీతిమంతులు ఇచ్చు ఫలము జీవ వృక్షము, జ్ఞానము గలవారు ఇతరులను రక్షించుదురు" అని దైవ వేదము ఘోషించు చున్నది (సామె 11 : 30). "బుద్ధిమంతులైతే ఆకాశమండలములోని జ్యోతులను పోలిన వారై ప్రకాశించెదరు. నీతి మార్గముననుసరించి నడుచుకొనునట్లు ఎవరు అనేకులను త్రిప్పుదురో వారు నక్షత్రములవలె నిరంతరము ప్రకాశించెదరు" అని దానియేలు 12 : 3 లో వ్రాయబడియున్నది. గనుక నీవు క్రీస్తుమార్గములోనికి ఎందరిని నడిపించావో అంతమట్టుకు జ్ఞానివైయుందువు, అంతమట్టుకు నక్షత్రమువలె ప్రకాశించెదవు. అయితే వ్యక్తిగతముగా మనము ఆత్మలను ఎందుకు రక్షించాలి ?

యేసుక్రీస్తు పాపుల రక్షకుడు వారిని రక్షించడానికే ఆయన ఈలోకానికి వచ్చారు. "నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెను" (లూకా 19 : 10). ఆయన గొప్ప జన సమూహములకు వాక్యాన్ని బోధించారు. ఒంటరిగానున్న వ్యక్తులకు కూడా ఆయన వ్యాక్యాన్ని బోధించారు. ఈలోకపు గతిని మార్చడానికి ఆయన వచ్చారు. ఆ పనిని సాధించునిమిత్తం ఆయన వ్యక్తిగత సువార్త పరిచర్యను చేసారు. ఆయన శిష్యులమైన మనం ఆయనను అనుకరించవలసిన వారము గదా ?

ఆదిమ క్రైస్తవులు ఆత్మల రక్షణయందు ఆసక్తి కలిగినవారు. "ప్రతి దినము దేవాలయములోను, ఇంటింటను మానక బోధించుచు యేసే క్రీస్తని ప్రకటించుచుండిరి" (అపొ. కా 5 : 42). అపొ. పౌలు ఎఫెసు సంఘ పెద్దలతో మాట్లాడుచు, "ప్రయోజనకరమైనది ఏదియు దాచుకొనక బహిరంగముగాను, ఇంటింటను మీకు తెలియజేయుచు, బోధించుచు, దేవుని యెదుట మారుమనస్సు పొంది మన ప్రభువైన యేసుక్రీస్తు నందు విశ్వాసముంచవలెనని, యూదులకును, గ్రీసు దేశస్థులకును ఏలాగు సాక్ష్యమిచ్చుచుంటినో యిదంతయు మీకు తెలియును" అని చెప్పెను (అపొ. కా. 20 : 20, 21).

అందరు వ్యక్తిగత సువార్త సేవ చేయాలని ఆజ్ఞాపింపబడినది. గనుక ప్రతి క్రైస్తవుడు ఆత్మలను సంపాదించాలి. "కాబట్టి మీరు వెళ్ళి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మని యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటి నన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి" యని యేసు ప్రభువు ఆజ్ఞాపించారు (మత్తయి 28 : 18 -20). "వాక్యమును ప్రకటింపుము; సమయమందును, అసమయమందును ప్రయాసపడుము" అని అపొ. పౌలు తిమోతిని హెచ్చరించాడు (2 తిమో 4 : 2). గనుక సువార్త వాక్యమును బోధించే బాధ్యత ప్రతి క్రైస్తవునిపై నున్నది. మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురు అని యేసు ప్రభువు చెప్పారు. మనం ప్రభువును ప్రేమిస్తే సువార్త వాక్యమును అందరికీ చాటుదుము.

క్రైస్తవులైన ప్రతివారు వ్యక్తిగతముగా సువార్త ప్రకటింపకపోతే యేసుప్రభువు యిచ్చిన గొప్ప ఆజ్ఞ నెరవేరదు. మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనొల్లని వానికి శిక్ష విధింపబడునని ఆయన చెప్పారు (మార్కు 16 : 15

16). మనం మన పొరుగువారికి, మన పొరుగు వారు తమ పొరుగువారికి సువార్త ప్రకటిస్తే సర్వలోకానికి సువార్త వ్యాపిస్తాది. క్రీస్తును గూర్చిన వార్త రక్షించే వార్త. దాన్ని యితరులకు చెప్పకుండా మన మెట్లుండగలము?

అపొ. పౌలు రోమీయులకు ఇట్లు చెప్పుచున్నాడు : "గ్రీసు దేశస్థులకును, గ్రీసు దేశస్థులు కానివారికిని, జ్ఞానులకును మూఢులకును నేను ఋణస్థుడను. కాగా నా వలనైనంతమట్టుకు రోమా లోని మీకును సువార్త ప్రకటించుటకు సిద్ధముగా యున్నాను. సువార్తను గూర్చి నేను సిగ్గు పడువాడనుకాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకది దేవుని శక్తియై యున్నది" (రోమా **1 : 14 - 16**).

మనం స్వయంగా పరలోకం వెళ్ళాలంటే మనం ఫలించాలి. మంచినేలను పడిన విత్తనము అరువదంతులుగాను, నూరంతులుగాను ఫలించినట్లు మనం ఫలించాలి. మనం క్రైస్తవులమై, నిలకడగా, భక్తిగా యుంటేను సరిపోదు. యేసు ప్రభువు ఇట్లు బోధించారు : "నేను నిజమైన ద్రాక్షావల్లిని, నా తండ్రి వ్యవసాయకుడు. నాలో ఫలింపని ప్రతీ తీగెను ఆయన తీసిపారవేయును. ఫలించు ప్రతి తీగె మరి ఎక్కువగా ఫలింపవలెనని దానిలోని పనికిరాని తీగెలను తీసివేయును........ ద్రాక్షవల్లిని నేను, తీగెలు మీరు. ఎవడు నా యందు నిలిచియుండునో, నేను ఎవనియందు నిలిచియుందునో వాడు బహుగా ఫలించును......మీరు బహుగా ఫలించుట వలన నాతండ్రి మహిమ పరచబడును; ఇందువలన మీరు నాకు శిష్యులగుదురని" ఆయన బోధించారు (యోహాను **15 : 1 - 8**).

ఆత్మలను పంపాదించుట, ఆత్మలను సంపాదించువాని ఆత్మకు క్షేమము. క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించాలంటే వాక్యాన్ని చదవాలి. దానిని విశ్వసించాలి. దానికి లోబడాలి. ఇతరులకు బోధించాలి. నీవు క్రీస్తు కొరకు ఆత్మలను సంపాదించువాడనైతే జ్ఞానివే ! !

# దేవుని యందు విశ్వాసము

## (Faith in God)

"విశ్వాసమనునది నిరీక్షింపబడువాటి యొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు ఋజువునైయున్నది" అని హెబ్రీ పత్రిక యొక్క గ్రంథకర్త చెప్పెను (హెబ్రీ 11 : 1). విశ్వాసమనగా నమ్మిక (Confidence, trust), అంగీకారము (Acceptance), విధేయత కలిగించునది అని చెప్పవచ్చును. ఈ పునాది మీదనే ఒకడు క్రైస్తవునిగా మారును. ఈ విశ్వాసము వలననే ఒకడు క్రైస్తవునిగా కొనసాగును. హెబ్రీ పత్రిక గ్రంథకర్త మరల ఇట్లు వ్రాసెను. "విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము ; దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకు వారికి ఫలము దయచేయువాడనియునమ్మ వలెను గదా " (హెబ్రీ 11 : 6). ఇచ్చట రెండు విషయములున్నట్లు గమనించుము. మొదటిది ఆయన ఉన్నాడు. రెండవది ఆయన తన్ను వెదకు వారికి ఫలము దయచేయును. ఇంతకు తక్కువగా నున్న యెడల ఒకని విశ్వాసమెట్లు అంగీకారమగును?

మన చుట్టు పరికించి అందలి వస్తు సముదాయములను చూచి పరలోకమందు దేవుడున్నాడని నమ్మకుండ ఎట్లుండగలము ? ఆకాశము, భూమి, జంతువులు జీవరాసులు ఇవన్నియు సృష్టికర్తను ప్రకటించుచున్నవి. "ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురపరచుచున్నది" అని దావీదు ప్రకటించెను (కీర్తన 19 : 1). "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు" (కీర్తన 14 : 1).

## ఎవరి యందు విశ్వాసముంచాలి?

దేవుడున్నాడని నమ్మినంత మాత్రాన సరిపోదు. యేసుక్రీస్తు ఆయన కుమారుడని మనము నమ్మవలెను. "మీ హృదయమును కలవరపడనియ్యకుడి; దేవుని యందు విశ్వాసముంచుచున్నారు నా యందును విశ్వాసముంచుడి" యని క్రీస్తు స్వయంగా చెప్పెను (యోహాను 14 : 1). ఈ ప్రకారము చెప్పు అనేక వాక్యములు కలవు. "దేవుడు లోకమునెంతో ప్రేమించెను కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3 : 16). "అంతట యేసు బిగ్గరగా యిట్లనెను - నా యందు విశ్వాసముంచువాడు నా యందు కాదు నన్ను పంపినవాని యందే విశ్వాసముంచుచున్నాడు". (యోహా 12 : 44).

క్రీస్తు నందు నమ్మిక యుంచని వాని సంగతి యేమి? లేఖనములు కూడా ఇట్టి వ్యక్తుల విషయమై చెప్పుచున్నవి. క్రీస్తు ఇట్లు చెప్పెను : "ఆయన యందు విశ్వాసముంచు వానికి తీర్పు తీర్చబడదు. విశ్వసింపని వాడు దేవుని అద్వితీయ కుమారుని నామమందు విశ్వాసముంచలేదు గనుక వానికి ఇంతకు మునుపే తీర్పు తీర్చబడెను" (యోహాను 3 : 18).

"కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు, కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వాని మీద నిలచి యుండును" (యోహాను 3 : 36).

"కాగా మీ పాపములలోనే యుండి మీరు చనిపోవుదురని మీతో చెప్పితిని. నేను ఆయనననివి మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపములలోనే యుండి చనిపోవుదురని వారితో చెప్పెను" (యోహాను 8 : 24).

పైన పేర్కొనిన వచనములలో, ప్రభువు నందు నమ్మిక యుంచుట వలన కలుగు దీవెనలు మనకు తప్పక కనబడుచున్నవి. అంతేకాక ఆయన యందు విశ్వాసముంచ నిరాకరించు వారికి కలుగు శాపములు, కష్టములు శిక్షలు కూడా కనబడుచున్నవి.

కాని ఎంతమట్టుకు మనము దేవునిని, క్రీస్తుదేవుని కుమారుడని నమ్మవలసి యున్నది? మనము మన తలంపులలో అంగీకరించిన సరిపోవునా? మన విశ్వాసమును చూపించవలెనని లేక ఋజువు పర్చవలెనని దేవుని వాక్యము చెప్పుచున్నది. ఉదాహరణగా క్రీస్తు ఇట్లు చెప్పెను : 'నేను చెప్పిన మాటల ప్రకారము చేయక ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును. ఆ దినమందు అనేకులు నన్ను చూచి ప్రభువా ప్రభువా మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్టలేదా? నీ నామమున అనేక అద్భుతములను చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు నేను - మిమ్ముని ఎన్నడును ఎరుగను. అక్రమము చేయువారలారా నా యొద్ద నుండి పొండని వారితో చెప్పుదును" (మత్తయి 7 : 21 - 23). వీరు విశ్వాసులు, అంతేకాదు వారు మతబోధలయందుండిరి. కానీ తప్పు ఎక్కడ ఉన్నది? వారు పరలోకపు తండ్రి చిత్తమును నెరవేర్చుటలేదు.

(మిగతా వచ్చే సంచికలో)

## ధర్మశాస్త్రము క్రైస్తవులకు కట్టడ కాదు

"నా జనులు జ్ఞానము లేనివారై నశించుచున్నారు" (హోషేయ 4 : 6). పూర్వమందు ప్రజలకు లిఖిత పూర్వకమగు చట్టము లేకపోయిన దినాలలో వారి మనస్సాక్షిని బట్టియే తప్పు ఒప్పులు నిర్ణయించుకొని ప్రవర్తించుచుండెడివారు (రోమా 2 : 15). అయితే యెహోవా దేవుడు ఇశ్రాయేలీయుల సంతతివారిని "నా జనులు" అని పిలుచుకొని వారి ప్రవర్తనకు

మార్గదర్శకముగా యుండుటకు సీను అరణ్యములో మోషేను కొండ పైకి పిల్చి తన వ్రేలితో వ్రాసిన ఆజ్ఞలు గల రెండు పలకలను అందచేసెను. "మోషే ఇశ్రాయేలీయులకిచ్చిన ధర్మశాస్త్రమిది" (ద్వితి 4 : 44). కొంతమంది మోషే ధర్మశాస్త్రము వేరు, యెహోవా యిచ్చిన ధర్మశాస్త్రము వేరు అని వాదించుటకద్దు. గాని అది వాస్తవము కాదు. మోషేయే యీ విషయమును విశదీకరించుచున్నాడు." మన దేవుడైన యెహోవా హోరేబులో మనతో నిబంధన చేసెను" (ద్వితి. 5 : 2). ఆ నిబంధనను మనము ద్వితీయోపదేశ కాండము 5వ అధ్యాయము ఒకటి నుండి ఇరువది రెండు వరకు చదివిన యెడల తెలిసికొనగలము. దావీదు తన గీతములో "ఇది ఇశ్రాయేలుకు కట్టడ" అని స్పష్టము చేసి యున్నాడు. (దాకీ 81 : 4). "యెహోవా మన పితరులతో కాదు, నేడు యిక్కడ (హోరేబులో) సజీవులమై యున్న మనతోనే యీ నిబంధన చేసి యున్నాడు" అని మోషే నిర్దిష్టముగా చెప్పియున్నాడు (ద్వితీ 5 : 3).

యెహోవా చేసిన నిబంధన ఇశ్రాయేలీయుల పితరులైన యాకోబుకు గాని, ఇస్సాకుకు గాని, అబ్రాహాముకు గాని వర్తించదు. ప్రత్యేక జనమని చెప్పబడు ఒక్క ఇశ్రాయేలు జనాంగమునకే యీ ధర్మశాస్త్రము వర్తించునని యిందు మూలముగా తెలుసుకొనుచున్నాము. మరియు యీ ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులు కాని యితర జనాంగములకు కూడా వర్తించదని చెప్పబడి యున్నది. "అన్య జనులు ఇశ్రాయేలీయులతో సహపౌరులు కారనియు, వారికి వాగ్దాన నిబంధనలు లేవనియు" వాక్యము చెప్పుచున్నది (ఎఫెసీ 2 : 12). ఇందును బట్టి చూడగా యీ ధర్మశాస్త్రము ప్రత్యేకముగా ఒక్క ఇశ్రాయేలు తెగకే యివ్వబడినది గాని మరి భూమి మీదనున్న ఏ జనాంగమునకు యివ్వబడలేదని ధృవమగుచున్నది. హిత్తీయులు, హివ్వీయులు, అమోరీయులు, ఐగుప్తీయులు, అమెరికావారు, ఇంగ్లీసువారు, జర్మనులు, జపానీయులు, భారతీయులు మరి ఏ జనాంగమైనను యీ ధర్మశాస్త్రమునకు బద్ధులు కారు.

## ధర్మశాస్త్రములో కొదువలు

ధర్మశాస్త్రము పరిశుద్ధమైన దేవుని వ్రేలితో వ్రాయబడినది గాన అది పరిశుద్ధమైనది. "ధర్మశాస్త్రము పరిశుద్ధమైనది, ఆజ్ఞ కూడ పరిశుద్ధమైనదియు నీతిగలదియు, ఉత్తమమైనదియునైయున్నది" (రోమా. 7:12). ధర్మశాస్త్ర మిచ్చుటలో యెహూవాదేవుడొక నిర్దిష్టమైన ఉద్దేశము కలిగియున్నాడు. పాపమనగా యేమిటో తెలియపర్చుటయే ఆయనకున్న ఉద్దేశము. "ధర్మశాస్త్రము వలననేగాని పాపమనగా ఎట్టిదో నాకు తెలియకపోవును" (రోమా 7:7). ధర్మశాస్త్రముయొక్క ముఖ్య ఉద్దేశమేమిటంటే ఏది పాపమో అది తెలిసికొని దాని విషయమై ఆయన ప్రజలు జాగరూకులై యుండవలెనని సూచించుట తప్ప దానిమూలమున నీతిమంతులమని తీర్చబడుదురని గాని దేవుని సమీపించుదురనిగాని సూచనలేదు.

" ధర్మశాస్త్రముచేత యెవడును దేవుని యెదుట నీతిమంతుడుగా తీర్చబడడను సంగతి స్పష్టమే" (గలతి 3 : 11). ఎందుచేత పరిశుద్ధమైన ధర్మశాస్త్రము వలన నీతిమంతులమని దేవుని యెదుట తీర్చబడలేము? దానియందు ఏమైన కొదువయున్నదా? "ధర్మశాస్త్రము దేనిని చేయజాలక పోయెనో దానిని దేవుడు చేసెను" (రోమా 8:2). దీనినిబట్టిచూచినయెడల దర్మశాస్త్రము పరిశుద్ధమైన దైనప్పటికిని అదికొన్ని విషయములలో బలహీనమైన దన్నట్లు కనబడు చున్నది. "ధర్మశాస్త్రము దేనికిని సంపూర్ణసిద్ధి కలుగచేయలేదు గనుక ముందియ్యబడిన ఆజ్ఞబలహీన మైనందునను, నిష్ప్రయోజనమైనందు వలనను అది నివారణచేయబడినది" (హెబ్రి 7:18). కొన్నిలోటులుదానిలో యున్నప్పటికిని, మోయలేని భారముగా అది పరిణమించినప్పటికిని, మానవులు దానిని వెంటాడ ప్రయత్నించుచున్నారు. " మనపితరులైననూ, మన మైననూ మోయలేని కాడిని శిష్యులమెడ మీదపెట్టి మీరెందుకు దేవుని శోధించుచున్నారని" యెరూషలేము సభలో అపొస్తలుడైన పేతురుచెప్పుచున్నాడు (అపొ॥కా॥ 15:10).

## ధర్మశాస్త్రము కొట్టివేయబడెను

ధర్మశాస్త్రము భారమైనదయినప్పటికిని అది దేవునిచేయివ్వబడినది గనుక దాని ఉద్దేశము నెరవేర్చబడకుండా దానిని రద్దుచేయుట సాధ్యముకాదు, ఇది మానవులకు అసాధ్యము, గనుక కాలము సంపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపి- - - ధర్మశాస్త్రమునకు లోబడిన వారిని విమోచించుటకు ధర్మశాస్త్రమునకు లోబడిన వానిగా (ఆయనను) చేసెను (గలతి 4:4,5). దేవుని కుమారుడైన క్రీస్తు యేసులోకములోనికి వచ్చి యీలాగుచెప్పెను- "ధర్మశాస్త్రమునైనను, ప్రవక్తల వచనముల నైననుకొట్టి వేయుటకురాలేదు" (మత్తయి 5:17).

మానవులు నెరవేర్చలేని ధర్మశాస్త్రము వట్టినేరద్దు చేయకుండా క్రీస్తు యేసు తన శరీరమందు నెరవేర్చి రద్దుచేసెను. "విధిరూపకమైన ఆజ్ఞలుగల ధర్మశాస్త్రమును తన శరీరము నందు కొట్టి వేయుట చేతమధ్య గోడను పడగొట్టి మన ఉభయులను యేకము చేసెను" (ఎఫెసి. 2:14). ప్రభువైన యేసు క్రీస్తు తన శరీరము నందు కొట్టివేసి ధర్మశాస్త్రము నుండి మనలనువిడుదలచేసెను (రోమా 7:6). ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకు కట్టడగా యుండినదిగాని ఇశ్రాయేలీయులతో సహపారులు కాని అన్యజనులకు ఎంత మాత్రమును, ఏ కాలమందును కట్టడ కాదు. హిందూదేశములో యున్నమనము అన్యులమేగాని ఇశ్రాయేలు గోత్రమునకు చెందిన వారము కాము. అన్యులు ఇశ్రాయేలీయులతో సహపారులు కారని వాక్యము చెప్పుచున్నది (ఎఫెసి. 2:12) ప్రభువు తన శరీరమందు దానిని నెరవేర్చి కొట్టి వేసినందున ధర్మశాస్త్రమిక మీదట ఇశ్రాయేలీయుల మీదనేమి, ఇశ్రాయేలీయులు కాని అన్యజనుల మీద నేమి అమలుపర్చబడదు. అది అదృశ్యమగుటకు సిద్ధముగా యున్నది.

# క్రైస్తవులకు కట్టడయేమి ?

"ధర్మశాస్త్రము విశ్వాస సంబంధమైనది కాదు" (గలతి 3:12), అది బలహీనమైనదియు, నిష్ప్రయోజనమైన దైనందునను దాని వెనువెంటనే మరీ శ్రేష్ఠమైన నిరీక్షణ ప్రవేశపెట్టబడెను; దీని ద్వారామనను దేవునియొద్దకుచేరుచున్నాము (హెబ్రీ. 7:19). అదియే క్రొత్తనిబంధన (హెబ్రి 8:8), క్రొత్తది అమలులోని కివచ్చినపుడు పాతది గతించిపోవునుగదా. మొదటిది ఉడిగిపోయి, అదృశ్యమగుటకు సిద్ధముగాయున్నదని బైబిలు చెప్పుచున్నది. (హెబ్రి 8:13). ఇది మాత్రము మీరు తెలిసికొనగోరుచున్నాను. ధర్మశాస్త్రక్రియల వలన మీరు ఆత్మనుపొందితిరాలేక విశ్వాసముతో వినుట వలన పొందితిరా? (గలతి. 3:2). వినుట వలన విశ్వాసముకలుగును (రోమా 10:17). మనుష్యుడు యేసు క్రీస్తునందు విశ్వాసముంచుట వలనేగాని ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలమూలమున నీతిమంతుడుగా తీర్చబడడనియెరిగిమనమును ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలమూలమున గాక క్రీస్తునందలి విశ్వాసము ద్వారానే నీతి మంతులమని తీర్చబడుటకై యేసు క్రీస్తునందు విశ్వాసముంచి యున్నాము. ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల వలన యేశరీరియు నీతిమంతుడని తీర్చబడడు (గలతి. 2:16).

రక్షణ క్రియల వలన కలిగినది కాదుగాని విశ్వాసము ద్వారా కృప వలననే రక్షింపబడియున్నాము. కాబట్టి విశ్వాసమూలమున మనము నీతి మంతులముగా తీర్చబడి మన ప్రభువైన యేసు క్రీస్తు ద్వారా దేవునితో సమాధానము కలిగియుందము (రోమా 5:1). ధర్మశాస్త్రము చేయలేనిది క్రొత్త నిబంధనను బట్టి క్రీస్తు యేసు కృప వలన జరిగినది. ఇది యిప్పుడు క్రైస్తవుల అనుభవము. "నేను దేవుని కృపను నిరర్థకము చేయను. నీతి ధర్మశాస్త్రము వలననైతే ఆపక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనము" (గలతి 2 : 21). ధర్మశాస్త్రమును అనుసరించువారి మీద ముసుగు వేయబడియున్నది గాన (II కొరింథి 3 : 14), వారి హృదయములు ప్రభువు వైపుకు తిరుగలేదు గనుక

క్రీస్తు మరణము వ్యర్థము చేయుచున్నారు. సోదరా ! క్రీస్తు మరణము నిష్ప్రయోజనము చేయుదువా, జ్ఞానము లేనివాడవై నశించుదువా? లోకమును, ఆచారమును జయించునది విశ్వాసము గాని, విశ్వాస సంబంధము కాని ధర్మశాస్త్రము కాదు, గుర్తుంచుకో. "ఈయన మాట వినుడి". దేవుడు మిమ్మును ప్రేమించుచున్నాడు.

- D.L. హెన్రీ, విశాఖపట్టణము

కొండమీద ప్రసంగము - 23

# ఉపవాసము

# Fasting

## (మత్తయి 6:16-18)

యేసు ప్రభువు కొండ మీద చేసిన ప్రసంగములో వ్యక్తిగత భక్తిని గూర్చిన మూడు రకములైన హెచ్చరికలనిచ్చారు. మొదటిది ధర్మము చేయుటను గూర్చి, రెండవది ప్రార్థన చేయుటను గూర్చి, మూడవది ఉపవాసముండు విధానమును గూర్చి ఆయన చెప్పారు. ఆయన యిట్లు చెప్పారు : " మీరు ఉపవాసము చేయునప్పుడు వేషధారుల వలె దుఃఖముఖులై యుండకుడి; తాము ఉపవాసము చేయుచున్నట్టు మనుష్యులకు కనబడవలెనని వారు తమ ముఖములను వికారము చేసికొందురు; వారు తమ ఫలము పొంది యున్నారని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. ఉపవాసము చేయుచున్నట్టు మనుష్యులకు కనబడవలెనని కాక, రహస్యమందున్న నీ తండ్రికే కనబడవలెనని, నీవు ఉపవాసము చేయునప్పుడు నీతల అంటుకొని, నీ ముఖము కడుగుకొనుము, అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి నీకు ప్రతి ఫలమిచ్చును" (మత్తయి 6:16-18).

ఈ ప్రసంగ భాగములో యేసు ప్రభువు ఉపవాసముండాలని గాని ఉండనక్కర్లేదనిగాని ఆజ్ఞాపించలేదు. మనుష్యులు ఏదో ఒక సమయంలో ఉపవాసముంటారని ఆయన ఊహించినట్లు కన్పడుచున్నది. మీరు ఉపవాసము ఉండనవసరం లేదని ఆయన చెప్పలేదు సరిగదా, ఉపవాసం ఉండే సరియైన విధానాన్ని గూర్చి ఆయన బోధించారు.

## బహిరంగ ప్రదర్శన కాదు

ఉపవాసం యొక్క అంతరంగిక భావాన్ని బట్టి దాన్ని ఒక బహిరంగ ప్రదర్శనగా చేయనవసరం లేదు. ఒకని జీవితంలో యున్న పాపాన్ని ఎదుర్కొనుటకు, తన భక్తి జీవితానికి కలుగు ఆటంకములను జయించుటకు, శోధనలను జయించుటకు ఒకడు ఉపవాసముండవచ్చును. అది అట్లున్నప్పుడు ఒకడు ఉపవాసముండి, దానిని గూర్చి మనుష్యులందరికి ప్రకటించిన యెడల అది వేషధారణ కాకపోతే ఇంకేమవుతాది? కొందరు ఉపవాసము చేయునప్పుడు మనుష్యులకు కనబడవలెనని తమ ముఖములను వికారము చేసి కొందురు. వారు తమ ఫలము పొందియున్నారని మన ప్రభువు చెప్పెను. ఉపవాసముండి తనముఖమును వికారము చేసికొనువాడు వేషధారియైతే, ఉపవాసముండకుండగనే ఉపవాసముండిన వానివలె నటించువాడుమరి ఇంకెంత వేషధారియగును ? మనం ఉపవాసముండిన యెడల అది మనుష్యులకు కనబడాలని గాక, దేవునికి కనబడితే చాలని సంతృప్తిచెందాలి.

ఉపవాసము ఒక మతసంబంధ ఆచారముగా దేవుడు తన ప్రజలను ఎన్నడు ఆజ్ఞాపించలేదు. అయితే లేఖనములను మనం చదువుచుండగా దేవుని ప్రజలు వివిధ సమయాల్లో వివిధ కారాణాలను బట్టి ఉపవాసముండినట్లు చూడగలము. ఇశ్రాయేలు ప్రజలు నాలుగవనెలలోను, అయిదవనెలలోను, ఏడవనెలలోను, పదియవ నెలలోను ఉపవాస దినములు ప్రకటించు కొన్నట్లు

జెకర్యా 8 : 19 నిబట్టి గ్రహింపగుచున్నది. యేసు ప్రభువు ఈలోకానికి వచ్చుసరికి పరిసయ్యులు ఇతరులకు తమ భక్తిని కనబరచుటకు గాను ప్రతి సోమవారం, ప్రతి గురువారం ఉపవాస ముండేవారు (లూకా 18 : 12).

## దుఃఖ పరిస్థితి

దుఃఖముగాని, రోగముగాని, మరణముగాని సంభవించినప్పుడు సహజముగా ప్రజలు ఉపవాసముంటారు. దావీదు తన శత్రువులను గూర్చి చెబుతు, " వారు వ్యాధితోనున్నప్పుడు గోనెపట్టకట్టుకొంటిని, ఉపవాసము చేత నాప్రాణము ఆయాసపరచుకొంటిని. అయినను నాప్రాణమునా యెదలోనికే తిరిగి వచ్చియున్నదని " చెప్పెను (కీర్తన 35 : 13). రాజైన సౌలును అతని కుమారుడైన యోనాతానును యుద్ధములో మరణించిరని దావీదు వినగానే అతడును, అతని అనుచరులను, వారిని గూర్చి దుఃఖపడుచు ఏడ్చుచు ఉపవాసముండిరి (1 సమూ 31 : 13 ; 2 సమూ 1 : 1-13). మోయాబీయులు, అమ్మోనీయులు యోహోషాపాతు మీదికి దండెత్తి వచ్చుచున్నారని విని అతడు యూదా అంతట వుపవాస దినము ఆచరింపవలెనని ప్రకటించెను (2 దినవృ 20 : 1-3). దేవుని ప్రజల అపరాధమును బట్టి వారు చెరగొని పోబడుటను జ్ఞాపకము చేసికొని ఎజ్రా వారిని బట్టి దుఃఖించుచు భోజన మైనను, పానమైనను చేయకుండెను (ఎజ్రా 10 : 6). నీనెవె ప్రజలు యోనా ప్రకటనను విని, "దేవుని యందు విశ్వాసముంచి ఉపవాస దినము చాటించి, ఘనులేమి అల్పులేమి గోనెపట్టకట్టుకొనిరి" (యోనా 3 : 5).

ఒకని మనస్సు దుఃఖముతో నిండియున్నప్పుడు ఆహారమువేపు మనస్సులాగదు. దుఃఖము, ఉపవాసము రెండు సాధారణంగా కలిసే ఉంటాయి. ఒక సందర్భములో యోహాను శిష్యులు యేసు నొద్దకు వచ్చి పరిసయ్యులును, మేమును తరచుగా ఉపవాసము చేయుచున్నాముగాని నీ శిష్యులు ఎందుకు ఉపవాసము చేయరు ? అని అడిగారు (మత్తయి 9 : 14). యోహాను శిష్యులు

ఈ ప్రశ్నను అడిగేసరికి బాప్తిస్మము ఇచ్చు యోహాను చెరసాలలో యుండెను. అందువలన అతని శిష్యులు దుఃఖించుచు ఉపవాసముండిరి. అయితే యేసు ప్రభువు ఇంకా తన శిష్యులతోనే యున్నాడు గనుక వారు ఉపవాసముండవలసిన పనిలేదని ఆయనవారికి జవాబిచ్చెను. "పెండ్లి కుమారుడు తమతోకూడ నుండు కాలమున పెండ్లియింటివారు దుఃఖపడగలరా ? పెండ్లి కుమారుడు వారియొద్దనుండికొని పోబడు దినములు వచ్చును, అప్పుడువారు ఉపవాసము చేతురు" అని ఆయన చెప్పెను (మత్త 9 : 14 - 15).

## ఆత్మీయ ఆసక్తి

ఆత్మీయ విషయాలను గూర్చి ఆసక్తి గలిగినవారు ఉపవాసము చేతురు. యెరూషలేము పట్టణము యొక్క దుస్థితిని గూర్చి నెహెమ్యాకు తెలియ జేయబడినప్పుడు అతడు బహుగా దుఃఖించెను. యెరూషలేము యొక్క ప్రాకారము పడద్రోయబడినది, దానిగుమ్మములును అగ్నిచేతకాల్చబడినవని నెహెమ్యా తెలిసికొని అతడు కూర్చుండి, యేడ్చి, కొన్ని దినములు ఉపవాసముండి ప్రార్థన చేసెను (నెహెమ్యా 1 : 1-4). క్రొత్త నిబంధనలో కొర్నేలియను భక్తుడు కూడ బహు ప్రార్థన పరుడు, ధర్మకార్యములు చేయువాడు ( అపో.కా. 10 : 30). అంతియొకయలోనున్న సంఘముబర్నబాను, పౌలును తమ మొదటి సువార్త యాత్రకు పంపకముందు, "వారు ఉపవాసముండి, ప్రార్థన చేసి వారి మీద చేతులుంచి వారిని పంపిరి" (అపో.కా. 13 : 1 - 3). తార్సువాడైన సౌలు దమస్కు మార్గములో యేసు ప్రభువును చూచిన తరువాత మూడు రోజుల మట్టుకు అన్నపానముల గైకొనకుండ ప్రార్థన చేయుచు, రక్షణ మార్గమును తనకు తెలియజేయుఅననీయ కొరకు కనిపెట్టుచుండెను (అపో.కా 9 : 9).

ఒక్కోసారి ఆత్మీయ విషయాల్లో సంపూర్తిగ నిండియుండుట వలన భౌతికావసరముల సంగతి మరచిపోవుట జరుగును. మోషే దేవుని నుండి

పదియాజ్ఞలను అందుకొను సమయమందు అతడు నలువది దివారాత్రులు ఉపవాస ముండెను (నిర్గమ 34 : 28). యేసు ప్రభువు కూడ యోహాను చేత బాప్తిస్మము పొందినప్పుడు నలువది రేయింబగళ్లు ఉపవాసముండెను (మత్తయి 4 : 1 - 11).

ఉపవాసముండుటను యేసు ప్రభువు వ్యతిరేకించలేదు. యేసు ప్రభువు, ఆదిమ సంఘము కూడ ఉపవాసమున్న మాదిరి మనకు కలదు. అయితే ఉపవాసాన్ని ఒక ఘనకార్యంగా ప్రకటించే వేషధారణను ఆయన ఖండిచారు. కొన్ని మతశాఖలవారు "ఉపవాసకూటములను" గూర్చి చుట్టుప్రక్కల దండోరా వేస్తారు. మనుష్యులకు కనబడాలని నటించే ప్రతి భక్తి క్రియను ఆయన ఖండించారు.

ఇప్పుడో, మరొకప్పుడో మనం ఉపవాసముండి ప్రార్థనలో గడిపే అవుసరత రాకపోదు. అట్టి సందర్భాల్లోమనకు సరియైన మనస్తత్వం ఉండాలి. అది హృదయ పూర్వకముగా జరుగుచున్న క్రియయై యుండాలి గాని ఎవరో బలవంతం పెట్టారని ఉపవాసముండుట మంచిది కాదు. అది మనఃపూర్వక మైన దైనప్పుడు అది మనకు దేవునికి మధ్య నున్న విషయమగును. "ఉపవాసము చేయుచున్నట్టు మనుష్యులకు కనబడవలెనని గాక, రహస్యమందున్న నీ తండ్రికే కనబడవలెనని, నీవు ఉపవాసము చేయునప్పుడు నీతల అంటుకొని నీ ముఖము కడుగుకొనుము. అప్పుడు రహస్యమందు చూచుచున్న నీ తండ్రి నీకు ప్రతిఫలమిచ్చును " (మత్త 6 : 17 - 18).

మనం ఎల్లవేళలా శుద్ధ హృదయం కలిగి వినయ భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన సేవ చేయుదముగాక !

- జాషువా గూటం.

# శోధన

## (Temptation)

శోధన అనగా చెడు చేయాలను ప్రేరేపణ. సాతాను శోధించును కాని పాపము చేయించడు. అనగా బలవంతంగా నిన్ను పాపములోనికి ప్రవేశ పెట్టడు. అతడు చేయునదంతయు ప్రేరేపణ. ఆయా సంగతులను మన కంటికి, మనస్సునకు వీలైనంత యింపుగా కనపర్చును. ప్రతి మానవుడు శోధనకు లోనౌతాడు. కావున శోధకుని గూర్చి, శోధనను ఎదిరించుటను గూర్చి తెలిసికొనుట ఎంతో మేలు.

**శోధకుడు** : కొందరు దేవుడు శోధించునని తలంచుదురు. కాని దేవుడు శోధించడు. "దేవుడు కీడు విషయమై శోధింపబడనేరడు; ఆయన ఎవరిని శోధింపడు గనుక, ఎవడైనను శోధింపబడినప్పుడు -- నేను దేవుని చేత శోధింపబడుచున్నానని అనకూడదు. ప్రతివాడు తన స్వకీయమైన దురాశ చేత ఈడ్వబడి మరులు కొల్పబడినవాడై శోధింపబడును" (యాకోబు 1 : 13, 14). ప్రతివాడు స్వంత దురాశచే ఈడ్వబడును. యుక్తి గల సర్పము "మీరు చావనే చావరు; ఏలయనగా మీరు వాటిని తిను దినమున మీ కన్నులు తెరవబడుననియు, మీరు మంచి చెడ్డలను ఎరిగిన వారై దేవదూతల వలె ఉందురనియు దేవునికి తెలియునని స్త్రీతో చెప్పెను" (ఆది. కా. 3 : 4 - 5). గమనించండి సాతానుడు కొన్ని అబద్ధములు చెప్పుట వలన హవ్వ తన స్వకీయమైన దురాశచే ఈడ్వబడి మరులు కొల్పబడి ఆ ఫలములను చూచినది. "స్త్రీ ఆ వృక్షము ఆహారమునకు మంచిదనియు, కన్నులకు అందమైనదనియు, వివేకమిచ్చు రమ్యమైనదియునై యుండుట చూచినప్పుడు ఆమె దాని ఫలములలో కొన్ని తీసికొని తిని తనతో పాటుతన భర్తకు ఇచ్చెను, అతడు కూడా తినెను" (ఆది

:6). అలా వారు శోధనకులోనై పాపము చేసిరి. మన శోధకుడు యుక్తి గలవాడని తెలిసికొని మనము జాగ్రత్తగా వుండాలి.

సాతాను అననీయ హృదయమును ప్రేరేపించుట వలన అతడు అబద్ధమాడి చనిపోయెను (అపో. కా. 1-5). యేసు క్రీస్తు శిష్యుడైన పేతురు కూడా శోధనకు లోనాయెను. తాను ప్రభువైన యేసుతో కూడా చెరలోనికి మరణమునకును వెళ్ళుటకు సిద్ధముగా నున్నానని తలంచి ఒప్పుకుంటాడు. కాని అతడు ముమ్మారు అబద్ధమాడునని యేసు చెప్పెను (లూకా 22:33,34). కాబట్టి తాను నిలుచున్నానని తలంచు కొనువాడు పడిపోకుండునట్లు జాగ్రత్తగా చూచుకొన వలెను (1 కొరింథీ 10:12). ఈ లోక వ్యవహారాల్లో యుక్తి... ఎడల మనము జాగ్రత్త గలిగి ప్రవర్తింతుము. అలాగే మన శోధకుని ఎడల కూడ జాగ్రత్త అవసరం.

## సాతానును ఎలా ఎదిరించాలి ? :

సాతానును ఎదిరించుటకు దేవుడు మనకొరకు అన్ని ఏర్పాట్లు చేసాడు- "మీరు అపవాది తంత్రములను ఎదిరించుటకు శక్తి మంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి.... విశ్వాసమను డాలు పట్టుకొనుడి; దానితో మీరు దుష్టుని అగ్ని బాణములన్నింటిని ఆర్పుటకు శక్తిమంతులవుదురు" (ఎఫెసీ 6:11,16).

## తప్పించుకొను మార్గము :

శోధన నుండి తప్పింపబడునట్లు ఎల్లప్పుడు మెలకువగా యుండి ప్రార్ధన చేయాలి. యేసు ప్రభువు " కాబట్టి మీరు జరుగ బోవు వాటి నెల్లను తప్పించుకొని, మనుష్య కుమారుని యెదుట నిలువ బడుటకు శక్తిగల వారగునట్లు ఎల్లప్పుడును ప్రార్ధన చేయుచు మెలకువగా ఉండుడని చెప్పెను" (లూకా

21:36). మన దేవుడు మనము సహింప గలగినంత కంటె ఎక్కువ శోధింపబడ నియ్యడు మరియు తప్పించుకొను మార్గము కూడా దయ చేయును. "సాధారణముగా మనుష్యులకు కలుగు శోధన తప్ప మరి ఏదియు మీకు సంభవింపలేదు. దేవుడు నమ్మదగినవాడు. మీరు సహింప గలిగ నంత కంటె ఎక్కువగా ఆయన మిమ్మును శోధింపబడ నియ్యడు. అంతే కాదు. సహింపగలుగుటకు ఆయన శోధనతో కూడా తప్పించు కొను మార్గమును కలుగ జేయును" (1 కొరింథీ 10:13). కావున మనము శోధింప బడునప్పుడు తప్పించు కొను మార్గము వెదకాలి.

## శోధన మన విశ్వాసమునకు కలుగు పరీక్ష :

"నా సహోదరులారా, మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి మీరు నానా విధములైన శోధనలలో పడు నప్పుడు, అది మహానందమని యెంచుకొనుడి" (యాకోబు 1:2-3) అని వ్రాయబడి యున్నది. మరియు "నశించిపోవు సువర్ణము అగ్ని పరీక్ష వలన శుద్ధి పరచబడుచున్నది గదా? దాని కంటె అమూల్యమైన మీ విశ్వాసము ఈ శోధనల చేత పరీక్షకు నిలిచినదై, యేసు క్రీస్తు ప్రత్యక్ష మైనప్పుడు మీకు మెప్పును మహిమయు ఘనతయు కలుగుటకు కారణ మగును." (1 పేతురు 1:7). సువర్ణమును అగ్నిచే శుద్ధి చేయుదురు. ఆ అగ్నిలో మలినములన్ని కాలిపోయి బంగారము శుద్ధియగును. అలాగే మనము కూడా శోధనకు నిలిచినచో ఈ శోధనలు మన జీవితములోని మలినాలను కాల్చి వేసి శుద్ధి చేయును. శోధన జయించుట వలన మెప్పును, మహిమయు ఘనతయు కలుగును.

## శోధనలో యేసు ప్రభువు సహకారి :

మన జీవితంలో కొన్ని సమస్యల పరిష్కారము కొరకు అనుభవంగల వారిని సంప్రదింస్తాము. అనుభవం గల వారు సరియైన సహాయం చేయగలరు.

అలాగే మన శోధనలో కూడా యేసు ప్రభువు సహాయం చేస్తాడు. ఆయన కూడా నరావతారియై ఈ లోకంలో జన్మించి శోధింపబడి గెలుపొందెను - "తాను శోధింపబడి శ్రమ పొందెను గనుక శోధింపబడువారికి సహాయము చేయగలవాడై యున్నాడు" (హెబ్రీ 2:18). మరియు - "మన ప్రధాన యాజకుడు మన బలహీనతల యందు మనతో సహానుభవము లేనివాడు కాడుగాని, సమస్త విషయములలోను మన వలెనే శోధింపబడినను, ఆయన పాపము లేని వాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృపపొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము" (హెబ్రీ 4:15,16). కావున మనము శోధింపబడినను పాపము చేయకుండుటకు యేసు క్రీస్తు సహాయం చేయును. మనము ఆయన సహాయాన్ని వేడాలి.

మన ప్రభువైన యేసు క్రీస్తు శోధనను వాక్యము వలన జయించెను (మత్తయి 4:3-10). మనము ఆయనను పోలినడచు కోవాలి. కనుక మనము కూడా వాక్యము ద్వారా శోధనను జయించగలము. వాక్యము ద్వారా జయించుటకు వాక్యము బాగుగా చదివి, గ్రహించాలి. వాక్య విషయంలో సరియైన గ్రహింపు లేనిచో వాక్యము ద్వారా మోసపోగలము. సాతానుడు వాక్యము ద్వారానే యేసు ప్రభువును కూడా శోధించెను. నేడు కూడా సాతానుడు ఈ తంత్రమునే ఉపయోగించుచు అనేకులను మోసపర్చు చున్నాడనుటకు నేడు మన మధ్య నున్న వందలాది మత శాఖలే నిదర్శనం. కావున దేవుని వాక్యమును జాగ్రత్తగా చదివి, పరిశీలించి సత్యమును గ్రహించాలి.

చివరగా మనము శోధనకు నిలిచినచో జీవకిరీటం పొందుదుము. "శోధన సహించువాడు ధన్యుడు; అతడు శోధనకు నిలిచినవాడై ప్రభువు తన్ను ప్రేమించు వారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును." (యాకోబు 1:2). మనమందరము శోధనను సహించి, జయించుటకు ప్రయత్నించుదము.

V.J. బెన్సన్, హైదరాబాద్.

# ఐక్యత
# (Unity)

" సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంతమేలు ! ఎంత మనోహరము ! "(కీర్త 133:1).

ఐక్యతను గూర్చి దావీదు పలికిన ఈ మాటలు సందేశాత్మకంగాను మార్గదర్శకంగాను క్షేమాభివృద్ధి కరంగాను ఉన్నాయి.

క్రీస్తు శరీరమైన సంఘక్షేమాభివృద్ధికి విఘాతం కలిగించే జఠిల సమస్య అనైక్యతయే. ఐక్యత ఎక్కడైతే లోపిస్తుందో అక్కడ అభివృద్ధి లోపిస్తుంది. కలిసి పనిచేయుటలో ఉన్న ఆనందం మరియు ఆశీర్వాదం ఏమిటో లేఖనాలు మనకు వివరిస్తున్నా స్వల్ప కారణాలవల్ల విడిపోయి మన విరోధియైన అపవాదికి జయించే అవకాశాన్ని కలిగిస్తున్నాం. "ఏకమైయుండాలని" క్రీస్తు ప్రభువు తండ్రికి చేసిన ప్రార్ధనలో, అపొస్తలుల హెచ్చరికల్లో ఐక్యత యొక్క ప్రాముఖ్యం స్పష్టంగా కనిపిస్తున్నది (యోహా 17:20-21, I కొరింధి 12:12-25).

"కాబట్టి మీరు సమాధానమను బంధముచేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడు కొనుట యందు శ్రద్ధ కలిగిన వారై, ప్రేమతో ఒకని నొకడు సహించుచు, మీరు పిలువబడిన పిలుపుకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణ వినయముతోను, సాత్వికముతోను నడుచుకొనవలెనని ప్రభువును బట్టి ఖైదీనైన నేను మిమ్మును బతిమాలు కొనుచున్నాను" ఎఫెస్సీ 4:1-3.

అబద్ద బోధలు నేడు తీవ్ర ప్రచారంలో ఉండడానికి సహోదరుల అనైక్యతయే కారణమనే విషయాన్ని గుర్తించి సంఘటితమై పోరాడితే, భేదాలను విస్మరించి చేయిచేయీ కలిపితే, విలువపెట్టి కొనబడిన వారమని గ్రహించి క్రీస్తు జ్ఞానము యొక్క సువాసన భూలోక మంతట వ్యాపింపజేస్తే పాతాళలోక ద్వారాలు ఆయన సంఘము ఎదుట నిలువ నేరవు.

మత శాఖలవారు వారి సభలకు వచ్చిన లక్షలాది ప్రజలకు అసత్యం బోధించి నడిపిస్తుంటే ఏ మాత్రం వేదన పడకుండా క్రీస్తు సిలువకు శత్రువులను వారి బోధలను ఎదిరించుట మాని సోదరులే అంతః కలహాలతో సతమతమైపోతే క్రీస్తు రాజ్యం ఆక్రమించే ప్రయత్నంలో ఉన్న శత్రువుల వ్యూహం ఫలిస్తుందని యిప్పటికైనా గ్రహించలేవా సోదరుడా ?

"మేము వితర్కములను, దేవుని గూర్చిన జ్ఞానమును అడ్డగించు ప్రతి ఆటంకమును పడద్రోసి ప్రతి ఆలోచనను క్రీస్తుకులోబడినట్లు చెరపట్టి, మీరు సంపూర్ణ విధేయతను కనుపరచినప్పుడు సమస్తమైన అవిధేయ ... ప్రతిదండన చేయ సిద్ధపడియున్నాము." (II కొరింధీ 10:5, 6).

కొరింధులోనున్న దేవుని సంఘములో కలహములు కలవని క్లోయె యింటి వారివలన వినిన పౌలు కొరింధీయులకు తన మొదటి పత్రిక వ్రాస్తూ ఏకమనస్సు, ఏక భావము కలిగి నడచుకొనవలెనని వేడుకొనెను. వారి సమస్యకు సరయిన పరిష్కారమును సూచించెను.

"సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడవలెననియు మీలో కక్షలు లేక, యేక మనస్సు తోను, ఏక తాత్పర్యముతోను, మీరుసన్నద్ధులై యుండవలెననియు మన ప్రభువైన యేసు క్రీస్తు పేరట మిమ్మును వేడుకొనుచున్నాను. నా సహోదరులారా, మీలో కలహములు కలవని మిమ్మును గూర్చి క్లోయె యింటివారి వలన నాకు తెలియ వచ్చెను. మీలో ఒకడు - నేను పౌలువాడను, ఒకడు - నేను అపొల్లో వాడను, మరియొకడు - నేను కేఫా వాడను, ఇంకొకడు - నేను క్రీస్తు వాడనని చెప్పుకొనుచున్నారని నా తాత్పర్యము. క్రీస్తు విభజింపబడి యున్నాడా? పౌలు మీకొరకు సిలువ వేయబడెనా? పౌలు నామమున మీరు బాప్తిస్మము పొందితిరా?" (I కొరింధీ 1:10-13).

"ఒకడు-నేను పౌలువాడను, మరియొకడు-నేను అపొల్లో వాడను అని చెప్పునప్పుడు మీరు ప్రకృతి సంబంధులైన మనుష్యులు కారా? అపొల్లో యెవడు? పౌలు ఎవడు? పరిచారకులేగదా. ఒక్కొక్కరికి ప్రభువనుగ్రహించిన

ప్రకారము వారిద్వారా మీరు విశ్వసించితిరి, నేను నాటితిని అపొల్లో నీళ్ళుపోసెను, వృద్ధి కలుగజేసిన వాడు దేవుడే" (I కొరింథీ 3:4-7).

కాబట్టి సమాధానమను బంధముచేత, ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడు కొనుట యందు శ్రద్ధకలిగినవారమై ఒకనొకడు సహించుకొన వలసిన వారమై యున్నాము. అప్పుడే మనం జయించగలం.

– E.K.V. ప్రసాదరావు

# దేవుని సర్వశక్తి

# (The Omnipotence of God)

(గత సంచిక తరువాయి)

దేవుని అమిత శక్తికి పరిమితులున్నాయి. సర్వశక్తిని గూర్చి కొందరు అపహాస్యము చేస్తారు. ఉదాహరణకు తాను మోయజాలనంత పెద్దబండను దేవుడు చేయగలడా? యనే ప్రశ్న నడిగినవారి తెలివిని లేదా నిష్కాపట్యాన్ని అది బయలు పరచుచున్నది. దేనినైనా ఒకే సమయమందు ఉండుటకు లేదా లేకుండుటకు దేవుడు చేయలేడు. యివి ప్రకృతి వైరుధ్యాలు. ఒకటి మరొక దాన్ని లేకుండాచేస్తాది. దానిని నమ్మవా? ఒకే సమయమందు తలుపును మూయడానికి తెరవడానికి ప్రయత్నించిచూడు. అసంభవమైన దాన్ని గూర్చిన చర్చయిక చాలును. గనుక కొన్ని విషయాల్లో దేవుడు ఎట్లు పరిమితము చేయ బడ్డాడో గమనింతము.

దేవుడు తన తత్వాన్ని బట్టి పరిమితం చేయబడ్డాడు. నీతి గల దేవుని మనం సేవించుచున్నాము. దుర్నీతిని చేయడము ఆయనకు అసాధ్యము. దేవుడు అబద్ధమాడజాలడని పౌలు సరిగానే వివరించాడు (తీతు 1:2). అట్లు చేయడం ఆయన తత్వంకాదు. దేవుడు అబద్ధమాడజాలడని హెబ్రి 6:18 లో కూడ వ్రాయబడియున్నది. "యెహోవా న్యాయ విధులు సత్యమైనవని, అవికేవలము

న్యాయమైనవి" (కీర్త 19:9). దేవుడు చాలజ్ఞాన వంతుడు, చాల మంచివాడు గనుక పొరపాటు చేయడు, చెడు జరిగించడు.

మానవుడు దేవుని పరిమితం చేస్తాడు. ఎంచుకొనే శక్తిని ఆయన మనకిచ్చాడు. ఈ ఎంపిక శక్తిని భంగపరచకుండునట్లు మనతో ఏకీభవించి పనిచేయుటకు ఆయన తన్నుతాను పరిమితము చేసుకొన్నాడు. దీనిని కేల్విన్ సిద్ధాంతము మన్నించదు. గాని నేను మన్నిస్తాను ఏలయనగా బైబిలు బోధించె బోధ అది. అందువలననే ఇశ్రాయేలీయులను గూర్చి చెప్పునపుడు కీర్తనల గ్రంధకర్త ఇట్లు చెప్పాడు. మాటి మాటికి వారు దేవుని శోధించిరి. మాటి మాటికి ఇశ్రాయేలు పరిశుద్ధ దేవునికి సంతాపము కలిగించిరి (కీర్తనలు 78:14). వారు వాగ్దాన దేశములోనికి ప్రవేశించాలని దేవుడు ఉద్దేశించినాడు గానివారి తిరగుబాటు వలన ఆ ఉద్దేశాన్ని జరిగించుటలో పరిమితము చేయబడ్డాడు. అదే సంగతి ఈనాడు కూడా సహజముగా జరుగుచున్నది. అందరు రక్షింపబడాలని ఆయన కోరుచున్నాడు (2 తిమో 2:4) గాని అందరు సువార్తకు విధేయులు కారు గనుక అందరు రక్షింపబడరు. మానవుని అవిధేయత, అజ్ఞానముల వలన దేవుడు మనయెడల చేయతలపెట్టిన వన్నీ చేయకుండా పరిమితము చేయబడుచున్నాడని నా నమ్మకము. ఆయన నుండి విస్తారమైన దీవెనలను పొందు నిమిత్తము, సర్వశక్తి మంతుడైన దేవునితో సహకరించుట మనకు జ్ఞానదాయకము కాగలదు.

"మనము సేవించుచున్న దేవుడు సమర్థుడు" అని షద్రకు, మేషాకు, అబేద్నెగొలతో కలసి ఉద్ఘాటిద్దాం. మరియు మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటి కంటెను ఊహించువాటిన్నిటి కంటెను అత్యధికముగా చేయ శక్తిగల దేవుడని ఎరిగి సంతోషిద్దాం (ఎఫెసి 3:20). ఆయన శక్తిని బట్టి మనం ఆశ్చర్యపడి ఆయన కృపా కనికరములను బట్టి ఆయనను కీర్తింతము.

(సమాప్తం)

- జిమ్. ఓ కోవర్

# సంక్షిప్త వార్తలు

మే నెల సువార్తికుల సదస్సు 31వ తేదీన కాకినాడ సత్యవాణి బిల్డింగ్ నందు ఆశీర్వాదకరముగాను ఆనంద దాయకముగాను జరిగెను. వివిధ జిల్లాల నుండి తరలి వచ్చిన సుమారు 400 మంది సువార్తికుల సమక్షంలో "క్రీస్తు యొక్క రెండవ రాకడలో యేమేమి సంభవించును ?" అను అంశము చర్చింపబడెను.

సోదరులు జాషువా గూటంగారు అధ్యక్షులుగా ఉండగా సోదరులు ఐరా. వై. రైస్ (యు.యస్.ఎ), పి. ప్రకాశం, ఇ.కె.వి ప్రసాదరావు, యమ్. ప్రసంగి, ఆర్. సిహెచ్. సద్గుణరావు, పాల్ గూటం గార్లు వాకోన్యపదేశము గావించిరి.

సుమారు 69 ప్రపంచ దేశాలలో క్రొత్త నిబంధన క్రైస్తవ్యము విస్తరించుటలోను, సోదరులు జె.సి. బెయిలీ గారిని ప్రోత్సహించి భారతదేశమునకు పంపించుటలోను ప్రముఖ పాత్ర వహించిన సోదరులు ఐరా. వై.రైస్ గారు చక్కని వర్తమానమును అందించిరి. క్రొత్త నిబంధన సంఘము ఆయా దేశాలలో విస్తరించిన చరిత్ర ఆయన వివరించగా సోదరులకు ఆనందము, ఆశ్చర్యము, ఆదరణ కలిగెను. క్రీస్తు సత్యమును లోకమునకు అందించుటకు అనేక పుస్తకములు, బైబిలు పాఠములు, వ్యాసములు వ్రాసి అనేక ఉపన్యాసములు నిచ్చి, అబద్దమును ఖండించుచు దేవుని సువార్తలో వెలుగొందుచున్న రైస్ గారిరాక, వారితో సహవాసము ఒక మధురానుభూతిగ సువార్తికులు భావించిరి, వీరు భారతదేశమునకు ప్రకాశించుచున్న జ్యోతి. వీరి వయస్సు 78 సంవత్సరాలు, 64 సంవత్సరాల నుండి వీరు సువార్త ప్రకటించుచున్నారు. వీరి 14వ సంవత్సరములోనే మొట్టమొదటి సువార్త ప్రసంగమును బోధించిరి. భారతదేవమునకు కెనడాతో నున్న సత్సంబంధాలను బట్టి ఒక కెనడా దేశస్థుడు ఒక మిషనెరిగా ఇండియాలో ఉండాలన్న ఆలోచన మొదటరైస్ గారిలో కలిగెను. నేడు ఆపనికి ప్రతి ఫలంగా 5000 స్థానిక సంఘాలు, పదిలక్షల మంది సభ్యులు యిండియాలో ఉన్నారు.

"సువార్త యితరులకు ప్రకటింపబడాలంటే సువార్త ప్రకటించాలి. సువార్త ప్రకటింప బడాలంటే ఎవరైనను పంపబడాలి" అని వారు చెప్పిరి.

క్రీస్తు రెండవ రాకడలో పంచ భూతములు లయమైపోవునని, క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రతివానికి ఆయన తీర్పు తీర్చునని, క్రీస్తు వెయ్యేండ్లు భూమిమీద పరిపాలించుననునది అబద్ధ సిద్ధాంతమని ప్రకటన **20:1-6** క్రీస్తు విజయమును గూర్చి అపవాది పరాజయమును గూర్చి చెప్పుచున్నదని వివరించిరి. క్రీస్తు రాకడ ఏ దినమున సంభవించునో అది తండ్రికి మాత్రమే తెలియునని వివరించిరి. (మత్త **24:36**). ఆయన రాకడ కొరకు క్రైస్తవులు సిద్ధపడి యుండాలని హెచ్చరించిరి. ఆయన ఆర్భాటముతో.... మేఘారూఢుడై వచ్చునని ప్రతి నేత్రమును ఆయనను చూచునని చెప్పబడెను. (ప్రక **1:7**) ఆయన తండ్రికి రాజ్యమును అప్పగించును.

సాయంకాల కూటములో కూడ సోదరులు ఐరా రైస్‌గారు అపో. పౌలు యొక్క సువార్తపరిచర్య పై ఆధారపడి చక్కటి వర్తమానము నందించిరి. కూటము అనంతరము **9** మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఈ సువార్తికుల సదస్సుకు హాజరైన వారందరు ఆనందోత్సాములతో తమ తమ గృహములకు వెళ్లిరి.

---

Regd. No. H/KD-45/KD H.O.
Date of Posting : 15th of Every month

From
**SATYA WAKKU**
P.O. Box 80
KAKINADA - 533 001

To

________________

________________

________________